ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (April,May&June- 2025)

# మూడు పదులు దాటిన స్త్రీవాద సంకలనం "నీలిమేఘాలు"

డా. ఎన్. విద్యాప్రవీణ,

తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ.

Received: 12/04/2025
Article Accepted: 25/05/2025
Published Online: 29/05/2025
DOI:10.53414/Sahithyatharangini.2025.2.2.143

**వ్యాస సంగ్రహం:**

నీలి మేఘాలు కవితా సంకలనం స్త్రీల సామూహిక చైతన్యానికి, వారి ఆవేదనకు, ప్రతిఘటనకు ప్రతీకగా నిలుస్తుంది. అక్టోబర్ 1993లో వెలువడిన ఈ సంకలనంలో మొత్తం 92 కవితలున్నాయి. స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్ష అణచివేత, అసమానత, హింసవంటి సమస్యలు బలమైన వ్యక్తీకరణల ద్వారా వెలుగులోకి రావడం జరిగింది. "నీలిమేఘాలు" సంకలనంలో స్త్రీల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, హక్కుల కోసం వినిపించిన సామూహిక గొంతుకగా వివరించడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

**కీలక పదాలు**: స్త్రీవాదం, అణచివేత, చైతన్యం, ఆత్మగౌరవం, అభ్యుదయం, నిషిద్ధం, అస్తిత్వం

**వివరణ:**

ప్రాచీన సమాజాల్లో చాలాకొద్దిమందికి మాత్రమే అధికారాలుండేవి. చాలామంది వారి కుటుంబంలో కానీ, సమాజంలో కానీ అణచివేతకు గురయ్యేవారు. ఈ అణచివేతకు గురైన వర్గాలలోని జనాభాలో దాదాపు సగభాగం ఉన్న స్త్రీలు కూడా ఒక ప్రధాన వర్గం. కుటుంబ నిర్మాణం నుండి వ్యవసాయం వరకు, పరిశ్రమల అభివృద్ధి నుండి పారిశ్రామిక రంగం వరకు స్త్రీలు నిరంతరం శ్రమించినప్పటికీ వారి శ్రమకు తగిన గుర్తింపు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఆర్థిక హక్కులు లభించలేదు. స్త్రీల అణచివేత కేవలం శారీరక ఆర్థిక స్థాయిలోనే జరుగలేదు. సమాజం నిర్మించిన భావజాలం కూడా స్త్రీలను ఒక నిర్దిష్టమైన పాత్రకు పరిమితం చేసింది. పాతివ్రత్యం, త్యాగం, సహనం, శాంతం, కుటుంబ గౌరవాన్ని కాపాడటం వంటి విలువలను ప్రధానంగా స్త్రీలకే నిర్దేశించడం ద్వారా వారి వ్యక్తిత్వ వికాసానికి పరిమితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో భారతదేశంలో స్త్రీ అభ్యుదయం, స్త్రీ విముక్తి కోసం జరిగిన ఉద్యమంలో భాగమే నీలిమేఘాలు స్త్రీవాద సంకలనం.

సమానత్వం, స్వేచ్ఛ, ఆత్మగౌరవం ఆధారంగా భవిష్యత్ సమాజాన్ని నిర్మించుకోవడానికి వారి సమిష్టి కృషిలో భాగమే స్త్రీవాద సంకలనాలు. ఈ సంకలనం తెలుగు సాహిత్యంలో పెను తుఫాను సృష్టించి స్త్రీవాదానికి బలమైన పునాదిని ఏర్పాటు చేసిందని చెప్పవచ్చు.

"బందిపోట్లు" కవితలో

"పాఠం, ఒప్పు చెప్పకపోతే పెళ్ళి చేస్తాన'ని
పంతులు గారన్నప్పుడే భయమేసింది
"ఆఫీసులో నా మొగుడున్నాడు
అవసరమొచ్చినా సెలవివ్వడ'ని
అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది
"వాడికేం? మగమహరాజ"ని
ఆడా, మగా వాగినప్పుడే అర్థమైపోయింది
"పెళ్ళంటే" "పెద్దశిక్ష" అని
"మొగుడంటే "స్వేచ్ఛా భక్షకుడ"ని
మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోందని"
(నీలిమేఘాలు – సావిత్రి – పుట 71)

బందిపోట్లు కవితలో సావిత్రి స్త్రీ స్వేచ్ఛను కోరుకుంటూ పితృస్వామ్య సమాజాన్ని ప్రశ్నించే చైతన్యవంతమైన కవిత. 1984 మార్చి ఆంధ్రజ్యోతి వార పత్రికలో ముద్రితమైన ఈ కవితలో స్త్రీని బంధించే ఆచారాలు, వివాహ వ్యవస్థలోని అసమానతలు, పురుషాధిక్యత, స్వేచ్ఛను హరించే కుటుంబ సంబంధాలను సావిత్రి నిర్భయంగా విమర్శించారు. స్త్రీకి రక్షణ పేరుతో బంధనాలు కాకుండా సమానత్వం, స్వేచ్ఛ, గౌరవం, స్వతంత్ర వ్యక్తిత్వం అవసరమని ఈ కవిత బలంగా ప్రకటించింది.

సాధారణంగా పెళ్ళి అనేది జీవితానికి భద్రత, గౌరవం, ఆనందాన్ని అందించే బంధంగా చిత్రిస్తారు. కానీ పెళ్ళి పేరుతో స్త్రీపై విధించే ఆంక్షలు, భర్త ఆధిపత్యం, నిర్భయ స్వాతంత్ర్యాన్ని కోల్పోవడం వంటి సమస్యలను సావిత్రి పెద్ద శిక్షగా అభివర్ణించారు. భర్త స్త్రీ యొక్క స్వేచ్ఛను హరించే వ్యక్తిగా మారినప్పుడు అతడు స్వేచ్ఛా భక్షకుడిగా కనిపిస్తాడంటుంది.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (April,May&June- 2025)

విద్య నేర్చుకోవడం స్త్రీల హక్కు. అయినప్పటికీ బాలికలను చదువుకోనివ్వకుండా పెళ్ళి చేయడం ద్వారా ఆమె భవిష్యత్తును నిర్ణయించే అధికారం సమాజం తన చేతుల్లోకి తీసుకుంటుంది. ఈ శీర్షికకు సావిత్రి సరైన కవితను రాశారు. బందిపోట్లు సంపదను దోచుకుంటారు. కానీ ఈ కవితలో దోపిడీకి గురి అయ్యేది సంపద కాదు. స్త్రీ స్వేచ్ఛ, వ్యక్తిత్వం, ఆశలు, నిర్ణయాధికారాలు. స్త్రీని ప్రేమిస్తున్నామని, రక్షిస్తున్నామని చెప్పే కుటుంబ సభ్యులే ఆమె స్వేచ్ఛను హరించడాన్ని కవయిత్రి వారిని సామాజిక బందిపోట్లుగా అభివర్ణించారు.

"నిషిద్ధ స్వప్నం" అనే కవితలో

"నేనమ్మలో ఉన్నప్పుడు
నేను కావాలని అమ్మ కోరుకుంటున్నట్టు
నాన్నకు తెలియగానే
ఈడ్చి చెంప పగలగొట్టిన నాన్న దెబ్బకి
నేనెవరో నాకు తెలిసింది
నేనొక స్త్రీని
నేనొక నిషిద్ధ జీవిని
మొన్నటి దాకా నా నవ్వు నిషిద్ధం
నిన్న నా చదువు నిషిద్ధం
నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే"
(నీలిమేఘాలు – శ్రీమతి – పుట 73)

స్త్రీల జీవితంపై పితృస్వామ్య వ్యవస్థ ఆధిపత్యాన్ని నిషేధించిన కవిత ఇది. ఒక ఆడ శిశువు పుట్టకముందే కొన్ని ఆంక్షలు ఆమె జీవితాన్ని శాసిస్తాయి. ఆమె ఎదుగుదలలో ఎదురయ్యే వివక్ష, చివరకు తన జీవితం గురించి తను ఎలాంటి నిర్ణయాధికారం తీసుకోలేని పరిస్థితిని చిత్రించింది. ఆడ శిశువు గర్భంలో ఉన్నప్పుడు, ఆమె తల్లి ఆడపిల్ల పుట్టాలని కోరుకున్న విషయం తండ్రికి తెలియగానే తల్లి చెంపపై కొట్టిన దెబ్బతో తన ఉనికి నిరాకరించబడిందని అర్థమవుతుంది. తను పుట్టకముందే తన జీవితం గురించి నిర్ణయం తీసుకునే అధికారం మరొకరికి ఉండటం స్త్రీ అస్తిత్వంపై జరుగుతున్న తొలి దాడిగా "శ్రీమతి" అనే కవయిత్రి చిత్రించారు.

స్త్రీ పుట్టుక, స్త్రీ నవ్వు, స్త్రీ చదువు, స్త్రీ జీవితం నిషిద్ధాలతో నిండిపోయిందని, నవ్వు నుండి చదువు వరకు, చదువు నుండి జీవితం వరకు నిషేధాలు విస్తరించాయని వాపోయింది. తల్లి గర్భంలోని ఆడశిశువు నుంచి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (April,May&June- 2025)

ఎదిగిన స్త్రీ వరకు ఆమె జీవితంపై పురుషాధికారం కొనసాగడం ఈ కవితలో కన్పిస్తుంది. స్త్రీ తన జీవితానికి తానే నిర్ణయాధికారిగా ఉండాలనే ఆధునిక స్త్రీవాద భావనకు ఈ కవిత బలమైన స్వరాన్ని అందించింది. ఈ కవిత ద్వారా స్త్రీ తన అస్తిత్వాన్ని గుర్తించాలని, ఆమె కలలను నిషేధాలకు గురికాకుండా సహజమైన మానవ హక్కులుగా చూడాలని సమాజాన్ని కోరుకుంటున్న ఒక చైతన్య భాస్వర గళంగా చెప్పవచ్చు.

"వంటిల్లు" కవితలో విమల ఒంటరి వంట గదులు కూల్చేందుకు రమ్మంటుంది.

"మా వంటిల్లు
తడి కట్టెల పొగమేఘాల మధ్య
మా వంటిల్లు వేలాడుతూ వుంటుంది
భయం, భయంగా, నిశ్శబ్దంగా, నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ
అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా వుంటుంది
ఏడ్చి, ఏడ్చి ఆమె కళ్ళ నీళ్ళు ఎక్కడో ఇంకిపోయాయి
తోమి, తోమి ఆమె చేతులు అరిగిపోయాయి
మా అమ్మకి చేతులు లేవు
ఆమెను చూస్తే
ఒక గరిటెగానో, పెనం లానో
మా వంటింటిని అలంకరించిన ఒక పరికరంలానో వుంటుంది
ఒక్కోసారి ఆమె మండుతున్న పొయ్యిలా కూడా వుంటుంది
అప్పుడు బంధీ అయిన పులిలా ఆమె
వంటగదిలో అశాంతిగా తిరుగుతుంది"

(నీలిమేఘాలు – విమల – పుట 86)

'వంటిల్లు' అనే కవిత స్త్రీ జీవితాన్ని వంటింటి నాలుగు గోడలకు పరిమితం చేసింది. వంటిల్లు కేవలం వంట చేసే ప్రదేశం కాదు. స్త్రీ స్వేచ్ఛను, వ్యక్తిత్వాన్ని, ఆశలను బంధించే ఒక ప్రతీక. "మా అమ్మ" ఒక వ్యక్తి మాత్రమే కాదు. కుటుంబం కోసం తన జీవితాన్నంతా ధారపోసే స్త్రీకి ప్రతిరూపం. ఆమె జీవితం వంటగదితో ముడిపడి పోయింది. కన్నీళ్ళు కూడా ఇంకిపోయేంతగా ఆమె బాధను అనుభవించింది. ఇక్కడ కవి స్త్రీని గరిటె, పెనం వంటి వంటింటి వస్తువులతో పోల్చడం ద్వారా సంపూర్ణ మానవ వ్యక్తిగా కాకుండా ఆమెను వంట పనికి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (April,May&June- 2025)

ఉపయోగపడే పరికరంగా చేశారు. ఆమె మండుతున్న పొయ్యిలా వుంటుంది. అమ్మలో కూడా అణచివేయబడిన కోపం, ఆవేదన, అసంతృప్తి, స్వేచ్ఛా ఆకాంక్షలు మండుతున్నాయి. బంధీ అయిన పులి ఎలా అశాంతిగా తిరుగుతుందో అలాగే స్త్రీని ఇంటి పనులకే పరిమితం చేసినప్పుడు ఆమె అంతరంగం కూడా స్వేచ్ఛ కోసం తపిస్తుంది. ఆమె అశాంతి బలహీనత కాదు. అది బంధనాలను ఛేదించాలనే అంతర్గత కోరిక.

సమాజంలో మన చుట్టూ జరిగే సంఘర్షణలను వస్తువులుగా స్వీకరించి వాటికి సాహిత్య రూపాలు ఇస్తున్నాం. ఆ సంఘర్షణల సాహిత్యాన్ని పదిమందికి తెలియచేసి దానిపై పోరాడే ధైర్యాన్ని పెంపొందించేందుకు బలమైన పునాదిని కూడా తయారు చేసి అందించినపుడే మనం సృష్టించే సాహిత్యానికి ప్రయోజనం చేకూరుతుంది.

"నడిచే గాయాలు" కవితలో కొండేపూడి నిర్మల

"నడిచే గాయాలు నువ్వెప్పుడైనా చూశావా?
నడవటమే కాదు
నవ్వుతాయ్
నగలు పెట్టుకుంటాయి
చిన్నప్పటి పూలజడ లాంటి
పట్టు పరికిణీ లాంటి
వాచకంలో దాచుకున్న నెమలికన్ను లాంటి
ఆత్మనూ ఆకూ వక్కలూ చేసి
కసకసా నములుతుంటాయ్
ఎర్రగా ఉమ్ముతూ ఉంటాయ"

(నీలిమేఘాలు – కొండేపూడి నిర్మల – పుట 162)

'నడిచే గాయాలు' అనే కవితలో గ్రామీణ జీవితం, ప్రకృతి, మానవ సంబంధాలు, గ్రామీణ సంస్కృతిలోని అనుభూతులను కవితాత్మకంగా వ్యక్తమయ్యాయి. గ్రామాలు స్థిరంగా ఉండే ప్రదేశాలు కావు. అక్కడి ప్రజలు, వారి జీవన విధానం, ఆచారాలు, పండుగలు, ప్రకృతి ఇవన్నీ నిరంతరం కదులుతూ వుంటాయి. పూలజడ, పట్టు పరికిణీ వంటి చిత్రాలు గ్రామీణ బాల్యం, పల్లె సంస్కృతి, సంప్రదాయ సౌందర్యాన్ని గుర్తుకు తెస్తాయి. అలాగే నెమలి అందం, రంగులు, నాట్యం గ్రామీణ ప్రకృతికి ఒక ప్రత్యేకమైన శోభను కలిగిస్తాయి. ఆకులు,

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (April,May&June- 2025)

వక్కలు, ఎర్రటి ఉమ్మి వంటి దృశ్యాలు పల్లె వాతావరణానికి సహజత్వాన్ని తీసుకువస్తాయి. ఇవి కృత్రిమమైన అలంకారాలు కాకుండా గ్రామీణ జీవితంలో భాగమైన వాస్తవ దృశ్యాలు.

స్త్రీల లైంగికత్వం మీదా, సంతానోత్పత్తి మీదా ఎలాంటి ఆంక్షలూ నిర్బంధాలూ ఉన్నాయనే దాన్నిబట్టే సమాజంలో స్త్రీల స్థానం, స్థితి ఆధారపడి ఉంటాయని చెబుతుంది. స్త్రీల సమస్యల్ని సామాజిక సమస్యలుగా గుర్తించినపుడే స్త్రీవాద కవిత్వానికి బలం చేకూరుతుందని స్పష్టం చేశారు.

"పైటని తగలెయ్యాలి" కవితలో జయప్రభ

"పైట కొంగును చూస్తే
నాకెందుకో
పాతివ్రత్యం గుర్తొస్తుంది
భుజాల నించి కిందికి వేలాడే
గుది బండలా
అదెప్పుడూ నా స్వేచ్ఛని హరిస్తూనే ఉంటుంది
నన్ను
నిటారుగా నిలవనివ్వక
పైట
నా గుండెలపై తన అంచుల చేతులాన్చి
నన్ను వంగదీయాలని చూస్తుంది
నాకు అలవాటు లేని
సిగ్గుని మప్పుతుంది
ఏదో కంగారుని పిట్టలా
నా చుట్టూ తిప్పుతుంది"

(నీలిమేఘాలు – జయప్రభ – పుట 194)

పాశ్చాత్య స్త్రీలు 'బ్రా'లను తగలేసిన ఉద్యమం స్ఫూర్తితో జయప్రభ పైటని తగలెయ్యాలని రాశారు. హిందీలో స్త్రీవాద కవయిత్రులు "గూంఘట" (మేలిముసుగు)ను తగలెయ్యాలని రాయడం జరిగింది. ఈ కవితను జయప్రభ 1988లో రాసి, 31-05-1988 ఆంధ్రజ్యోతి దినపత్రికలో స్త్రీశక్తిలా ప్రచురించారు.

స్త్రీ దుస్తులకు కేవలం శరీరాన్ని కప్పే ప్రయోజనం మాత్రమే ఉండదు. అవి ఆమె శీలం, గౌరవం, కుటుంబ ప్రతిష్ట, పాతివ్రత్యం వంటి విలువలతో అనుసంధానించబడతాయి.

ఈ కవితలో కవయిత్రి పైటకు స్త్రీ పాతివ్రత్యానికి ఉన్న సామాజిక సంబంధాన్ని ప్రశ్నిస్తుంది. సంప్రదాయ సమాజంలో స్త్రీ ధరించే దుస్తులను ఆమె శీలం, పాతివ్రత్యం, కుటుంబ గౌరవంతో ముడిపెట్టడం జరుగుతుంది. పైట తనకు గుదిబండలా, భారంగా అనిపిస్తుందని కవయిత్రి వాపోయింది. దాని వెనుక ఉన్న సంప్రదాయ నియమాలు స్త్రీ స్వేచ్ఛను అడ్డుకునే భారాలుగా మారాయని చిత్రించింది.

జయప్రభ పైటను తగలేయాలని చెప్పడంలో దాన్ని తిరస్కరించినట్లుగా కాక దానితో ముడిపడి ఉన్న స్త్రీ అణచివేత, బలవంతపు సిగ్గు, విధేయత, పితృస్వామ్య విలువలను తిరస్కరించాలని పిలుపునిచ్చింది. దీని ద్వారా స్త్రీ తనను తాను స్వతంత్ర వ్యక్తిగా, సంపూర్ణ మనిషిగా గుర్తించుకోవాలనే విముక్తి భావాన్ని బలంగా వ్యక్తం చేస్తుంది.

**ముగింపు:**

స్త్రీవాద కవిత్వం అనేది స్త్రీల సమస్యలను మాత్రమే వ్యక్తం చేసే కవిత్వం కాదు. స్త్రీని అణచివేసే సామాజిక, కుటుంబ, సాంస్కృతిక వ్యవస్థలను ప్రశ్నిస్తూ, సమానత్వం, స్వేచ్ఛ, గౌరవం, ఆత్మగౌరవం, మానవ హక్కులు వంటి విలువలను ప్రతిపాదించే సాహిత్య ధోరణి. స్త్రీ జీవితాన్ని పురుషాధిక్య సమాజం నిర్ణయించకూడదని, తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తానే తీసుకునే హక్కు స్త్రీకి ఉండాలని స్త్రీవాద కవిత్వం స్పష్టం చేస్తుంది. సమాజంలో ప్రతి మనిషికి సమాన గౌరవం ఇవ్వాలని, వారికి స్వేచ్ఛ, హక్కులు ఉండాలనే మానవతా దృక్పథాన్ని ప్రతిపాదిస్తుంది. స్త్రీని అణచివేసే వ్యవస్థలను ప్రశ్నించడం ద్వారా సమాజంలోని ఇతర అసమానతలను కూడా గుర్తించే చైతన్యాన్ని కలిగిస్తుంది.

**ఆధార గ్రంథాలు**

1. నీలిమేఘాలు (1993) – ఓల్గా
2. తెలుగులో కవితోద్యమాలు (2003) – ఆచార్య కె. యాదగిరి (సంపా.)
3. తెలుగు సాహిత్య చరిత్ర (1996) – ముదిగంటి సుజాతా రెడ్డి